జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 23 | మార్చి | 2026 • పేజీలు : 6



# వైభవంగా గోదావరి హారతి



**భద్రాచలం, మార్చి 22, ప్రజాజ్యోతి:** భద్రాచలం దివ్యక్షేత్రంలోని పుణ్య గోదావరి స్నాన ఘట్టాల వద్ద నిర్వహి స్తున్న గోదావరి హారతి కార్యక్రమం చైత్ర శుద్ధ చవితి సందర్భంగా మరింత వైభవంగా సాగింది ఆది వారం సాయంత్రం శ్రీ సీతారామచం ద్రస్వామి దివ్యక్షేత్రం భద్రాచలం లోని గోదావరి కరకట్ట వద్ద జరిగిన నదీహారతి కార్యక్రమం అత్యంత విశి ష్టమైనదని ఈ పర్వదినాన భద్రాద్రిలో నిర్వహించే గోదావరి హారతి ప్రత్యేక ఆధ్యాత్మిక మహిమ కలిగి ఉంటుం దని రామవజ్జల రవికుమార్ అన్నారు భక్తులు అధిక సంఖ్యలో హాజరై హారతిలో పాల్గొనడం ఆనం దదాయకమని పేర్కొన్నారు. అనం తరం గోదావరి హారతి విశేషాలను మరియు చైత్ర మాస ప్రాముఖ్యతను

మిగతా 2 లో...



- సమన్వయంతో సమర్ధ పరిపాలన
- ప్రజలకు భద్రత – సేవల్లో నాణ్యత
- నాలుగు శాఖల్లో నలుగురు ధృడ స్తంభాలు

5 లో..

# భద్రాద్రికి భరోసా...

పుణ్యక్షేత్రంగా దేశవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం పొందిన భద్రాచలం పట్టణంలో భక్తుల రద్దీ రోజురో జుకు గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు, నాణ్యమైన వైద్య సదుపాయాలు, రవాణా నియంత్రణ వంటి కీలక రంగాల్లో సమర్థవంత మైన పరిపాలన అత్యంత అవసరంగా మారింది. ఈ బాధ్యతలను సమన్వయంతో నిర్వహిస్తూ పోలీసు, రెవెన్యూ, వైద్య, రవాణా శాఖలకు చెందిన నలుగురు అధికారులు తమ తమ రంగాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ పట్టణ పరిపాలనను సజావుగా నడిపిస్తు న్నారు. ముందస్తు ప్రణాళికలు, వేగవంతమైన సేవలు, ప్రజల సమస్యలపై స్పందనతో పని చేస్తూ భద్రాచలా నికి నమ్మకమైన ఆధారంగా నిలుస్తున్నారు. ప్రజల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ సమన్వయంతో పనిచేస్తున్న ఈ అధికారులు పట్టణ అభివృద్ధికి నాలుగు బలమైన స్తంభాలుగా నిలుస్తూ ఆదర్శ పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తు న్నారు. ఈ నేపథ్యంలో ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.....

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



# కొండెక్కిన కోడి

### భారీగా పెరిగిన ధరలు

### కిలో చికెన్ రూ. 320 పైనే -ఎండలు పెరగడం, దిగుమతి తగ్గడమే కారణమా!

### సామాన్యుడి జేబుకు చిల్లు

**ఇల్లందు, మార్చి 22, ప్రజాజ్యోతి:** నాన్ వెజ్ ప్రియులకు భానుడు గట్టి షాకే ఇచ్చాడు. ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్క లేనిదే ముద్ద దిగని సగటు జీవికి ఇప్పుడు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మొన్నటి వరకు రూ. 270 నుండి రూ. 300 మధ్యలో ఊగిసలాడిన కిలో చికెన్ ధర ఇప్పుడు ఒక్కసారిగా రూ.320 మార్కును దాటేసింది. వేసవి ఎండల తీవ్రత పెరగడంతో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, ఎండ దెబ్బకు ఫారాల్లో కోళ్లు మృత్యువాత పడటం, ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. సప్లై తక్కువగా ఉండటం, డిమాండ్ రోజురోజుకూ

మిగతా 2 లో...



## శ్రీరామనామాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి: ఈవో కె దామోదర్ రావు

**భద్రాచలం మార్చి 22, ప్రజా జ్యోతి:** మన హిందూ సంప్రదాయ పద్ధతులు ఆచారాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో చేస్తున్న సేవలు అభినందనీయమని భద్రాచలం దేవస్థానం ఈవో కె దామోదర్ రావు అన్నారు ఆది వారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రీరామ నామాన్ని ప్రతి గ్రామానికి

మిగతా 2 లో...

# కొత్తగూడెంలో.... కాంగ్రెస్‌కు బీటలు..?

2 లో..



• జిల్లా కేంద్రంలో క్షీణిస్తున్న కాంగ్రెస్ పార్టీ..? • ముఖ్యమైన సమావేశాల్లో గైర్హాజరు అవుతున్న రాష్ట్ర స్థాయి నాయకులు • అయోమయంలో కార్పొరేటర్లు, కార్యకర్తలు • రాష్ట్ర నేతలమని చెప్పుకునే వారు ఎక్కడ? • కార్యకర్తలకు అండగా నిలిచేది ఎవరు!

## శ్రీరామనామాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి: ఈవో కె దామోదర్ రావు



(మొదటి పేజీ తరువాయి...)

ప్రతి ఇంటికి తీసుకెళ్లే దిశగా భక్తులు చేస్తున్న ప్రయత్నం విశేషమని తెలిపారు భక్తుల ఈ నిబద్ధత రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు భద్రాద్రి శ్రీరాముని అనుగ్రహం భక్తులపై ఎల్లప్పుడూ ఉంటుందని ఆకాంక్షించారు. గోటితో ఒలిచిన తలంబ్రాలను సమర్పించే భక్తుల ఆచారం ప్రత్యేకతను ఈవో వివరించారు సంవత్సర కాలం పాటు ప్రత్యేక పద్ధతుల్లో పండించిన ధాన్యాన్ని మహిళలకు పంపిణీ చేసి స్థానిక రామాలయాల్లో నిత్య పూజలు నిర్వహిస్తూ తిరిగి సేకరించి భక్తిప్రపత్తులతో భద్రాచలానికి కాలినడకన తీసుకువచ్చి సమర్పించడం హిందూ సంప్రదాయ విలువలను ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఇక భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారికి ఆదివారం ప్రత్యేక తలంబ్రాల సమర్పణ జరిగింది హైదరాబాద్‌కు చెందిన చలువాది మల్లివిష్ణు వందన అనే భక్తురాలు బియ్యపు గింజలపై చేతితో శ్రీరామ నామం లిఖించిన తలంబ్రాలను సమర్పించారు ఈ తలంబ్రాలకు ఈవో కె దామోదర్ రావు ఏఈవో శ్రావణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో సమర్పించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది భక్తులతో కూడిన బృందం గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించింది అదేవిధంగా ఒంగోలు కాకినాడ ప్రాంతాలకు చెందిన శ్రీరామ మండలి భక్త బృందాలు కూడా కోటి తలంబ్రాలను సమర్పించాయి. ఈ తలంబ్రాలను రాబోయే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో వినియోగించాలని భక్తులు కోరారు దేవస్థానం అధికారులు ఇందుకు సానుకూలంగా స్పందించారు. పండుగల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు దర్శనం నివాసం తాగునీరు అన్నదానం వైద్యసేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు భక్తులు కూడా ఆలయ నియమ నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కోరారు.

## వైభవంగా గోదావరి హారతి



(మొదటి పేజీ తరువాయి...)

భక్తులకు వివరించారు గణపతి పూజ దీపోత్సవం నిర్వహించి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారు లోకకల్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందుతున్నారని తెలిపారు. హారతి అనంతరం శాంతి మంత్రాల పఠనం నిర్వహించగా సిరిపురపు అశోక్ కుమార్ శర్మ దంపతులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాచలం రెడీమేడ్ బట్టల వ్యాపారుల సంఘం అందించింది. గోదావరి నదీహారతి ప్రారంభానికి ముందు తెలంగాణకు చెందిన అనిల్ అకాడమీ ఆర్ట్స్ నిత్యభారతి కళాశాల హైదరాబాద్ విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ వరలక్ష్మి వెంకటేశ్వర్లు పురోహితులు సురేష్ శర్మ అశోక్ కుమార్ శర్మ వీరభద్ర శర్మ రామాచార్యులు ప్రసాద్ శర్మ ఫణి కుమార్ శర్మ కృష్ణ శర్మ తేజ శర్మ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు

# కొత్తగూడెంలో.... కాంగ్రెస్‌కు బీటలు..?



● జిల్లా కేంద్రంలో క్షీణిస్తున్న కాంగ్రెస్ పార్టీ..? ● ముఖ్యమైన సమావేశాల్లో గైర్హాజరు అవుతున్న రాష్ట్ర స్థాయి నాయకులు ● అయోమయంలో కార్పొరేటర్లు, కార్యకర్తలు ● రాష్ట్ర నేతలమని చెప్పుకునే వారు ఎక్కడ? ● కార్యకర్తలకు అండగా నిలిచేది ఎవరు!

**కొత్తగూడెం, మార్చి 22 (ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై తీవ్ర చర్చలు మొదలయ్యాయి. ఒకప్పుడు బలమైన స్థాయిలో ఉన్న పార్టీ ప్రస్తుతం నాయకత్వ లోపంతో బలహీనపడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులమని చెప్పుకునే నేతలు కీలక సమయంలో కనిపించడం లేదని స్థానిక కార్యకర్తలు మండిపడుతున్నారు. ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ రాష్ట్ర నాయకత్వం అనే చెప్పుకునే వారి నుంచి స్పందన లేకపోవడం అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా కార్పొరేటర్లు తమ కార్యకర్తల సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో సరైన నాయకులు దూరంగా ఉండటం కార్యకర్తల్లో నిరుత్సాహాన్ని పెంచుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఒక్కరే పార్టీని భుజాన వేసుకుని నడిపిస్తున్నారనే భావన వ్యక్తమవుతోంది. జిల్లాలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో ఆమె ఒంటరి పోరాటం కొనసాగుతోందని కార్యకర్తలు అంటున్నారు. మహిళ నాయకురాలుతో కలిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పని చేసేందుకు రాష్ట్ర, జిల్లా నాయకులు ముందుకు రాకుండా ముఖం చాటుతున్నట్లుగా వదంతులు వినిపిస్తున్నాయి. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడం నాయకత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ››› కార్యకర్తలకు అండగా నిలిచేది ఎవరు

ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని కాంగ్రెస్ కోల్పోవడం పార్టీ బలహీనతను బయటపెడుతోందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో సమర్థ నాయకత్వం లేకపోవడం కార్యకర్తల్లో నిరుత్సాహాన్ని పెంచుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలో పార్టీ పట్టు తగ్గిపోతున్నట్లు ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. పేరుకు మాత్రమే రాష్ట్ర నాయకులమని చెప్పుకునే వారు ఇప్పుడు ఎటు వెళ్లిపోయారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ జిల్లాలో సమన్వయం లోపించడం వల్ల కార్యకర్తలు తలోదిక్కు వెతుక్కుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు పార్టీకి పెద్ద సవాల్‌గా మారాయి. పార్టీ ప్రతిష్ఠ కోసం పని చేయాల్సిన నాయకులు పక్కకు తప్పుకోవడంతో బరిలో ఉన్న అభ్యర్థులు ఆపసోపాలు పడాల్సి వచ్చిందని చర్చించుకుంటున్నారు. సరైన నాయకత్వం లేకపోవడంతో కొత్తగూడెంలో ఒకప్పుడు కంచుకోటగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి బీటలు పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచే నాయకులు ఎవరని ప్రశ్నలు వస్తున్నాయి.

### ››› జిల్లా కేంద్రంలో కనుమరుగవుతున్న కాంగ్రెస్..?

భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య చర్చలు జోరుగా సాగుతున్నాయి. అవసరమైన సమయంలో రాష్ట్ర స్థాయి నాయకులు కనిపించడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై స్పందన లేకపోవడం అసంతృప్తికి దారి తీస్తోంది. ముఖ్యంగా కార్పొరేటర్లు తమ డివిజన్ అభివృద్ధి అంశాలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితి ఏర్పడిందని చెబుతున్నారు. పార్టీ భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్న ఈ తరుణంలో రాష్ట్ర నాయకత్వం తక్షణం స్పందించి స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వాలని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నారు.




## కొండెక్కిన కోడి

(మొదటి పేజీ తరువాయి...)



పెరుగుతుండటంతో సామాన్యుడడి జేబుకు చిల్లు ఏడుతుంది. ప్రస్తుతం స్కిన్ లెస్ చికెన్ ధర కిలో రూ.340కి చేరింది. లైవ్ బర్డ్ ఫారాల వద్ద రూ. 200 పలుకుతుండగా, రిటైల్ రూ.320 వద్దకు చేరింది. పట్టణాల్లో ధరలు హైదరాబాద్ తో పోటీ పడుతూ రూ. 320 వద్ద ఉన్నాయి. విచిత్రమైన విషయం ఏంటంటే.. చికెన్ రేట్లు ఇంతగా పెరుగుతున్నా. గుడ్ల ధరలు మాత్రం కాస్త ఊరటనిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో డజను గుడ్లు రూ.64 కే లభిస్తున్నాయి. ఇక నాటు కోడి ప్రియుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నాటుకోడి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో నాటుకోడి రూ.750 నుండి రూ.800 వరకు పలుకుతుంది. పండుగలు అయిపోయిన కానీ చికెన్ కు భారీగానే డిమాండ్ పెరిగింది. దీనికి తోడు ఎండల వల్ల కోళ్లు చనిపోతుండటంతో ఉత్పత్తిదారులకు తీరని నష్టం వాటిల్లుతుంది. గతేడాది సంక్రాంతి సమయంలో బాయిలర్ కోడి ధర రూ.340 చేరిన దాఖలాలున్నాయి. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే మరో వారం రోజుల్లో చికెన్ ధర రూ.350 మార్కును సులువుగా దాటేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదరనున్నాయి. ఇది పౌల్ట్రీ రంగానికి పెద్ద సవాల్ గా మారనుంది. ఎండ తీవ్రతను తట్టుకోలేక కోళ్లు చనిపోతుండటంతో యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. ఉత్పత్తి తగ్గితే ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, మే నెల నాటికి చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండకపోవచ్చని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆదివారం రోజున చికెన్ సెంటర్ల వద్ద జనం రద్దీ కనిపిస్తున్నా, పెరిగిన రేట్లు చూసి చాలామంది తక్కువ పరిమాణంలోనే కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. చికెన్ ధరలు భారీగా పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎండ వేడికి కోళ్లు చనిపోతుండటం, కోళ్ల దిగుమతులు తగ్గడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తుంది. ఇల్లందు పట్టణంలో హోల్‌సేల్ చికెన్ వ్యాపారులతో పాటు చిన్నచిన్న దుకాణదారులు వారం, పదిరోజులకు సరిపడా కోళ్లను కొని పెట్టుకొని చికెన్ విక్రయిస్తుంటారు.

ఎండల బాగా ముదరడంతో వీరి దగ్గర ఉన్న కోళ్లు చనిపోతున్నట్లు తెలిసింది. దీంతో తమ వద్ద ఉన్న కోళ్లను రేట్లు పెం చి విక్రయాలు చేస్తున్నారని సమాచారం. మార్చి నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. రానున్న రెండు నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, తద్వారా చికెన్ ధరలు సైతం భారీగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కిలో చికెన్ రూ. 400 దాటే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇదే జరిగితే చికెన్ ప్రియు లకు బిగ్ షాక్ అని చెప్పొచ్చు.

# కొత్తగూడెంలో పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కొత్తగూడెం, మార్చి 22 ( ప్రజాజ్యోతి )**కొత్తగూడెం నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని భజన మందిర్ సెంటర్‌లో ఉన్న పద్మశాలి కళ్యాణమండపంలో ఎన్నికల కన్వీనర్ పుట్టా శంకరయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షుడిగా ఇమంది ఉదయ్ కుమార్, కార్యదర్శిగా మాచర్ల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా మాదాసి మాధవ్ రావు, కోశాధికారిగా కేదాసి నవీన్ ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా వేముల మధుకర్, సామంతుల నరేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని సభ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను సంఘ పెద్దలు ఆముదాల వెంకటనరసయ్య, మోతుకూరి ధర్మారావు, కనుకుంట్ల కుమార్, భోగా నారాయణ, చిప్ప శ్రీనివాస్ అభినందించారు. సంఘ అభివృద్ధికి తాము కూడా పూర్తి స్థాయిలో సహకరిస్తామని వారు తెలిపారు.

# మూడు ఐఈడి బాంబులు నిర్వీర్యం





**చర్ల, మార్చ్ 22: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మాలో భద్రతా దళాలు గాలింపు చర్యల్లో భాగంగా మూడు శక్తివంతమైన ఐఈడీలను స్వాధీనం చేసుకుని, నక్సలైట్ల భారీ కుట్రను భగ్నం చేశాయి . స్వాధీనం చేసుకున్న 1 కేజీ, 2 కేజీ, 4 కేజీల బరువున్న ఐఈడీలను సురక్షితంగా ధ్వంసం చేశారు. శనివారం 226వ బెటాలియన్ గాలింపు చర్యలు చేపట్టిన సందర్భంగా, జగరుగుండ–నరసాపురం రహదారిపై మావోయిస్టులు అమర్చిన మూడు శక్తివంతమైన ఐఈడీలను స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలకు తీవ్ర నష్టం కలిగించే ఉద్దేశంతో అమర్చిన ఈ ఐఈడీల బరువు 1 కేజీ, 2 కేజీలు, మరియు 4 కేజీలు ఉన్నాయి.ఐఈడీని స్వాధీనం చేసుకున్న తర్వాత, గాలింపు బృందం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డీఎస్ఎండీ డాగ్ స్క్వాడ్ సహాయంతో దానిని అక్కడికక్కడే ధ్వంసం చేసి, ఆ తర్వాత బెటాలియన్‌కు సురక్షితంగా తిరిగి వచ్చింది అని అధికారులు అన్నారు.

# కెఓసి లో డైరెక్టర్(పి. పి )పర్యటన

**టేకులపల్లి,మార్చి22,ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా కెఓసీలో సింగరేణి డైరెక్టర్(పి. పి )కె. వెంకటేశ్వర్లు ఆదివారం పర్యటించారు. డైరెక్టర్(పి.పి) కెఓసి వ్యూ పాయింట్ మైన్లో పని స్థలాలను, మైన్ లో జరిగే పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులు, పని సమయంలో భద్రతా చర్యలు, యంత్రాల పనితీరు సరిదర అంశాలపై అధికారితో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. బొగ్గు నాణ్యత తో పాటు, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ముందుకు తీసుకువెళ్లాలని సింగరేణి డైరెక్టర్ (పి.పి) వెంకటేశ్వర్లు,జి.యం వి. కృష్ణయ్య కు తెలియజేశారు. బొగ్గు వెలికితీత సామర్థ్యం పెంచి జి–13బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉండాలని ఆయన తెలిపారు. గనిలో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు, రక్షణతో కూడిన బొగ్గు తీయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కేఓసి, పిఓ గోవిందరావు, జెకె, ఓసి జాకీర్ హుస్సేన్, డీజిఎం(సివిల్ )రవికుమార్, డిజిఎం(ఏరియా వర్క్ షాప్) నాగరాజు నాయక్, కే ఓ సి మేనేజర్ శ్రీనివాసరావు, క్వాలిటీ మేనేజర్ రాందాసు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# అంబేద్కర్ హాల్ అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు



**కొత్తగూడెం, మార్చి 22 ( ప్రజాజ్యోతి )** అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పునర్ వైభవం కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిరంతరం కృషి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నూతన కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మందా హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సాబీర్ పా షా తో పాటు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మా ట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి సిపిఐ పార్టీ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే ఇప్పటికే రూ. 15 లక్షల నిధులు మంజూరు చేశారని భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి హాల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నియోజకవర్గంలో బహుజన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. అంబేద్కర్ ఆశయ సాధనలో ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కమ్యూనిటీ హాల్ కమిటీ క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో కూసపాటి శ్రీనివాస్, మద్దెల శివకుమార్, సలిగంటి శ్రీనివాస్, కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ధర్మరాజు, కంచర్ల జమలయ్య, కమిటీ సభ్యులు మధుసూదన్, చిన్ని, పీక కృష్ణ, గుండా రమేష్, పాల్, భూపేష్, మహిళా సభ్యులు కనుకుంట్ల రాములమ్మ, కరీష రత్నకుమారి, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రారంభించిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి బడ్జెట్ లో అరకొరగా రూ.45 కోట్లు

- బోధన సిబ్బంది నియామకం నిల్
- అడ్మిషన్ల కోసం మొగ్గు చూపని విద్యార్థులు
- యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 22,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీకి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అరకొరగా రూ. 45 కోట్లు నిధులు కేటాయించింది, అభివృద్ధికి వేల కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా బడ్జెట్లో 45 కోట్లు కేటాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రస్తుతం లక్ష్యాల దిశగా ముందుకు పోతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, యూనివర్సిటీ ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగకపోవడం, బోధనా సిబ్బంది నియామకాలు లేకపోవడం, విద్యార్థుల ప్రవేశాలపై నిరుత్సాహకర పరిస్థితులు నెలకొనడం వంటి అంశాలు ఈ యూనివర్సిటీ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తే అవకాశాలు కూడా లేకపోలేదు అనిపిస్తుంది, ప్రత్యేకంగా, బోధన సిబ్బంది నియామక ప్రక్రియ సరిగా లేకపోవడం వల్ల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తున్నట్లు ఉంది,.యూనివర్సిటీలో 54 మంది సిబ్బంది అవసరం కాగా నేటి వరకు ఒక్కరిని కూడా నియమించకపోవటం విస్మయాన్ని కనిపిస్తున్నట్లు ఉంది, ఇదే సందర్భంలో సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులలో నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ఉంటుందనిపిస్తుంది, గత ఏడాదిబి. ఎస్సీ జియాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైన్స్ లలో 120సీట్లు ఉండగా ,కేవలం 51 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారని, అదేవిధంగా ఎం.ఎస్సీ జియాలజి, ఎం.ఎస్సీ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ లలో 80 సీట్లకు గాను కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు పొందినట్లు తెలుస్తోంది, యూనివర్సిటీ అభివృద్ధి కోసం యూనివర్సిటీ వర్గాలు రూ. 300 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా కేవలం రూ.45 కోట్లు మంజూరు చెయ్యటం పట్ల యూనివర్సిటీ అభివృద్ధి ఏ మేరకు జరుగుతుందో వేచి చూడాలి.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ఇతర యూనివర్సిటీలకు నిధులు మంజూరు చేసే విధంగా పాల్వంచలోని మన్మోహన్ సింగ్ సైన్స్ ఎర్త్ యూనివర్సిటీకి కూడా నిధులు పెంచి యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపితే విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలుగా మారే అవకాశాలు ఉన్నాయి.

# ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



**చర్ల, మార్చి 22(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం చర్ల శాఖ గ్రంధాలయంలో కవిత గోష్టి వైభవంగా నిర్వహించారు. ప్రముఖ సామాజికవేత్త సాహితీ ఔత్సాహికులు చింతూరు వెంకటరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించచారు .ఈ సందర్భంగా జరిగిన కవితా గోష్టిలో పట్టణానికి చెందిన ప్రముఖ కవులు బత్తుల వెంకటేశ్వర్లు, తంగిళ్ళపల్లి శంకరాచారి, ఆడెపు ముత్యాల రావు, తమ స్వీయ కవితలు వినిపించారు సమాజంలో కవిత యొక్క ప్రాముఖ్యతను మానసిక వికాసానికి కవిత్వం ఇచ్చే ప్రేరణను వారు తమ కవితల ద్వారా వివరించారు. సాహిత్యం ద్వారానే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు .ఈ కార్యక్రమంలో కవితా రసజ్ఞులు సాహితీ పిపాసి వెంగళ వెంకటరమణ తో పాటు పలువురు పుస్తక ప్రియులు, పాఠకులు పాల్గొన్నారు.

## ఇక్కట్లు పడుతున్న హెచ్పి వినియోగదారులు

- టేకులపల్లి సేవలాల్ సేన మండలం అధ్యక్షులు బానోత్ కిసాన్ నాయక్



**టేకుల పల్లి, మార్చి22, ప్రజాజ్యోతి:** మండలంలో హెచ్పి గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు.గ్యాస్ కావాలంటే వారం, పదిరోజులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది.అసలు సిలిండర్లు ఎప్పుడు వస్తాయో? ధర ఎంత చెల్లించాలో? అనే విషయంపై గ్యాస్ ఎజెన్సీ నిర్వహణ దారుల తీరుప ట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కావాలంటే కనీసం వారం పదిరోజులైనా ఆఫీస్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెల కొందని వినియోగదారులు వాపోతున్నారు అని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ ఆరోపించారు.గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ ఎప్పుడు వస్తుందో సమాచారం చెప్పేవారే కరువయ్యారని వినియోగదారులు మండిపడుతున్నారు ఆయన అన్నారు.గ్యాస్ సిలిండర్ కావాలంటే కనీసం వారం ఐదురోజులైనా రోడు మీద ఉంచిన రైతులు చేను లో పనులు చేసూకోవాలా గ్యాస్ బండి కోసం ఎదురు చూడాలా అనే గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారని ఆయన అన్నా రు. సమస్యపై స్థానిక సంఘాల నేతలు స్పందిస్తూ.. గ్యాస్ సరఫరాలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించాలని, వినియోగదారులకు సత్వరమే డెలివరీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.అధికారులు స్పందించి గ్యాస్ డెలివరీ వ్యవస్థను క్రమబద్ధీకరిం చాలని,సామాన్యుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు అని ఆయన అన్నారు.

## ఒకరికొకరు ఓదార్పుగా..!

- ఒంటరితనాన్ని దూరం చేస్తూ ఊరటగా నిలబడ్డారు
- శారీరక బలం తగ్గిన ప్రేమ ఆప్యాయతతో బంధం బలంగా మారుతుంది



**అశ్వారావుపేట, మార్చి 22, ప్రజాజ్యోతి :** ముసలితనం శాపం కాదని బాధ్యతలు, ప్రేమ, గౌరవంతో కూడిన అందమైన జీవిత ప్రయాణమని, శారీరక బలం తగ్గిన ప్రేమ ఆప్యాయతతో బంధాన్ని మరింత బలంగా తీర్చిదిద్దుకోవచ్చని, ఒంటరితనాన్ని దూరం చేస్తూ ఒకరికొకరు ఓదార్పుగా నిలబడుతూ నేటి ఎందరో యువ జంటలకు పాఠంగా, ఆదర్శంగా నిలిచిన సంఘటన అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన నూనె గంగారత్నం అనారోగ్యంతో చికిత్స నిమిత్తం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేరారు. సుమారు 70 సంవత్సరాల వయసులో భర్త వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఉన్న తన భార్యకు చేస్తున్న సేవలు బంధానికి నిర్వచనంగా నిలిచాయి. తన భార్య గంగా రత్నానికి భోజనం తినిపిస్తూ ఉండగా కొందరు ఈ వృద్ధుల ఫోటోలు తీసి సామాజిక మాధ్యమలలో పోస్ట్ చేయడంతో వైరల్ గా మారాయి. భార్యాభర్తల బంధం అంటే కష్టసుఖాలలో అండగా నిలబడుతూ, నిస్వార్థ ప్రేమకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడుతు, ఆ అమ్మ త్వరగా కోలుకొని మరి ఎంతోమందికి ఆదర్శంగా ఈ జంట నిలవాలని పలువురు కోరుకుంటున్నారు.

- సమన్వయంతో సమర్థ పరిపాలన
- ప్రజలకు భద్రత – సేవల్లో నాణ్యత
- నాలుగు శాఖల్లో నలుగురు ధృడ స్తంభాలు



# భద్రాద్రికి భరోసా...

**పుణ్యక్షేత్రంగా దేశవ్యాప్తంగా విశేష ప్రాధాన్యం పొందిన భద్రాచలం పట్టణంలో భక్తుల రద్దీ రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు, నాణ్యమైన వైద్య సదుపాయాలు, రవాణా నియంత్రణ వంటి కీలక రంగాల్లో సమర్థవంతమైన పరిపాలన అత్యంత అవసరంగా మారింది. ఈ బాధ్యతలను సమన్వయంతో నిర్వహిస్తూ పోలీసు, రెవెన్యూ, వైద్య, రవాణా శాఖలకు చెందిన నలుగురు అధికారులు తమ తమ రంగాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ పట్టణ పరిపాలనను సజావుగా నడిపిస్తున్నారు. ముందస్తు ప్రణాళికలు, వేగవంతమైన సేవలు, ప్రజల సమస్యలపై స్పందనతో పని చేస్తూ భద్రాచలానికి నమ్మకమైన ఆధారంగా నిలుస్తున్నారు. ప్రజల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ సమన్వయంతో పనిచేస్తున్న ఈ అధికారులు పట్టణ అభివృద్ధికి నాలుగు బలమైన స్తంభాలుగా నిలుస్తూ ఆదర్శ పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.....**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం పట్టణంలో భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్ననేపథ్యంలో శాంతి భద్రతలు, ప్రజా సేవలు, వైద్య సదుపాయాలు, రవాణా నియంత్రణ వంటి కీలక రంగాల్లో సమర్థవంతమైన పరిపాలన కొనసాగుతోంది. ఈ బాధ్యతలను సమన్వయంతో నిర్వహిస్తున్న నలుగురు అధికారులు పట్టణానికి నాలుగు బలమైన స్తంభాలుగా నిలుస్తున్నారు.

**శాంతి భద్రతల్లో కట్టుదిట్టం...**



భద్రాచలం పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణలో సీఐ నాగరాజు చురుకుగా వ్యవహరిస్తున్నారు. సహాయ పోలీసు అధికారి విక్రాంత్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో పండుగల సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ప్రణాళికలు రూపొందించి, సిబ్బందిని సమర్థంగా వినియోగిస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు, గోదావరి ఘాట్లు, కరకట్ట, ప్రధాన వీధులు, కూడళ్ల వద్ద ప్రత్యేక పహారా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు.
సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచడంతో పాటు కార్డన్ సెర్చ్‌లు, వాహన తనిఖీలు, రాత్రి గస్తీలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచి నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జేబుదొంగలు, చోరీ ఘటనలను నివారించేందుకు సివిల్ డ్రెస్సులో పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.
భక్తులకు సౌకర్యం కల్పించేందుకు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి తప్పిపోయిన వారిని గుర్తించి కుటుంబాలకు చేర్చే సేవలు అందిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను కేవలం కేసులుగా కాకుండా కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేస్తూ కుటుంబ, ఆస్తి, సామాజిక వివాదాలను చర్చల ద్వారా రాజీ చేసేందుకు కృషి చేస్తున్నారు. దీని వల్ల కోర్టు కేసులు తగ్గి ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెరుగుతోంది.
అక్రమ గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, ఇసుక దందా, అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటూ పలు దాడులు నిర్వహిస్తున్నారు. యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువై శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహిస్తూ సీఐ నాగరాజు విశ్వాసాన్ని సంపాదిస్తున్నారు.

**రెవెన్యూ సేవల్లో మార్పు ...**

తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయ వ్యవస్థలో గణనీయమైన



మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే భయాందోళనలతో వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ప్రస్తుతం కార్యాలయాన్ని మరమ్మతులు చేసి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు.
ఉద్యోగులకు విభాగాల వారీగా బాధ్యతలు కేటాయించి, దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించే విధానాన్ని అమలు చేస్తున్నారు. భూమి, ఆదాయం, కుల ధ్రువపత్రాలు వంటి సేవలను త్వరితగతిన అందిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నారు.
అలాగే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అందిన వినతులను త్వరగా పరిష్కరించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. రెవెన్యూ సేవల్లో పారదర్శకత, వేగం తీసుకువచ్చి ప్రజలకు చేరువవుతున్న తహసీల్దార్‌గా గుర్తింపు పొందుతున్నారు.

**వైద్య సేవల్లో నాణ్యత...**



భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయి. అత్యవసర, ప్రసూతి, శిశు వైద్య విభాగాలు సహా అన్ని సేవలు సమర్థవంతంగా అందుబాటులో ఉన్నాయి.
క్లిష్టమైన కేసులను వైద్య బృందంతో సమన్వయంతో పరిష్కరిస్తూ అనేక ప్రాణాలను కాపాడుతున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు సేవలు అందిస్తున్నారు. అంబులెన్స్ సదుపాయాలు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంచుతున్నారు.

**రవాణా నియంత్రణలో కట్టుదిట్టం...**

మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్



వెంకట పుల్లయ్య రవాణా శాఖలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు.పాఠశాల వాహనాల తనిఖీల ద్వారా ఓవరల ోడింగను అరికడుతూ విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టారు. వాహనాల ఫిట్‌నెస్, లైసెన్సులు, అనుమతిపత్రాలను తనిఖీ చేస్తూ రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరిస్తున్నారు.



**సమన్వయంతో సజావు పరిపాలన...**

భద్రాచలం పట్టణంలో పరిపాలన సజావుగా సాగడానికి వివిధ శాఖల అధికారుల సమన్వయం ప్రధాన కారణంగా నిలుస్తోంది భద్రత సౌకర్యాలు పారిశుధ్యం వైద్యం రవాణా వంటి కీలక రంగాల్లో ఐదు శాఖల అధికారులు సమష్టిగా పనిచేయడంతో భక్తులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయి. పండుగల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపడుతూ అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నారు భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో పాటు పరిశుభ్రత రవాణా సౌకర్యాలు వైద్య సేవలు సమర్థంగా అందిస్తున్నారు .స్థానిక ప్రజలు , భక్తులు అధికారుల పనితీరుపై ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు ముఖ్యంగా పండుగల సమయంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా భద్రాచలం పట్టణానికి ఈ ఐదుగురు అధికారులు నిజమైన ఐదు బలమైన స్తంభాలుగా నిలుస్తూ సమర్థ పరిపాలనకు ఆదర్శంగా నిలుస్తున్నారు

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా గోగికార్ రామలక్ష్మణ్
- కార్యదర్శిగా మడకం చందు



**చర్ల, మార్చ్ 22:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లోని లక్ష్మీ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో గల జాంబవం తుడి గుట్టల పై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయము నందు ఆదివారం ఆలయ పూజారి మడకం దేవ అధ్యక్ష తన పుర ప్రముఖులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా ఆలయ పూజారి మడకం దేవ మాట్లాడుతూ మహిమాన్విత అమ్మల గన్న అమ్మ భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారి దివ్య ఆశీస్సులు భక్తకో టికి అందించాలనే ఉద్దేశ్యంతో ఆల య నూతన కమిటీని నియమించడం జరుగుతుందని ఆయన అన్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా గోగికార్ రామల క్ష్మణ్ ( పాత్రికేయులు, వనవాసి కళ్యా ణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిల యం ఉపాధ్యాక్షులు ) ఉపాధ్యక్షుడిగా బీరబోయిన శేఖర్ మడివి భరత్ (మూ ల ఆదివాసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి) (కార్యదర్శిగా మడకం చం దు( మూల ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు) ప్రధాన కార్యదర్శిగా తోలె మల్లయ్య ( వెలుగు ఆఫీసు లో ఎం ఎస్ ఏ) కోశాధికారిగా బీరబోయి న శంకర్ ( టీచర్) గౌరవ అధ్యక్షులు గా ఇర్ప శ్రీనివాసరావు ( చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్) కమిటీ సభ్యులుగా వేల్పుల రామకృష్ణ ఏల్పుల రమేష్ ఉయిక రాంబాబు కేధారి వంశీ లను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం బీరబోయిన రా ణి మడకం అరుణ కుమారి కోర్స లక్ష్మీ నక్కా మహాలక్ష్మి తోలె లక్ష్మీ మడకం మంగమ్మ మడకం విజయ పూనెం ల క్ష్మీ కోర్స వైష్ణవి మడకం దేవి కోర్స శిరీ షలతో మహిళా కమిటీని కూడా నియ మించడం జరిగిందనీ తెలిపారు.

## బిజెపి మండల అధ్యక్షులు ముందస్తు అరెస్ట్



**పినపాక,మార్చి 22(ప్రజాజ్యోతి ):** భారతీయ జనతా పార్టీ పినపాక మండల అధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్ ను హైదరాబాద్ అసెంబ్లీ వద్దకు వెళ్లకుం డా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసినట్లు ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.ఈ ఘటనపై బీజేపీ నాయ కులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నా రని విమర్శించారు. మరోవైపు, చట్టం మరియు శాంతి భద్రతల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 22,ప్రజా జ్యోతి:** సోమవారం కలెక్టరేట్ లో నిర్వ హించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకా లంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 నుండి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నేత్ర నిపుణుల సంఘానికి కొత్త కమిటీ

- కండె దేవేందర్‌కు జిల్లా అధ్యక్ష బాధ్యతలు

**పినపాక,మార్చి 22(ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆప్టోమెట్రీ అసో సియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది.జిల్లా అధ్యక్షుడిగా కండె దేవేందర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా ప్రేమ్, జనరల్ సెక్రటరీగా నరేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రసన్న, ట్రెజరర్‌గా రమేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ద్రోణ ఎన్నికై నట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించింది.కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం.అని అయన తెలిపారు.ఈ సందర్భంగా కండె దేవేందర్ మాట్లాడుతూ జిల్లాలో ఆప్టోమెట్రీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలి పారు.రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఆర్ఆర్ నేత్రాలయ ఎండీ భగవాన్, జిల్లా మాజీ అధ్యక్షులు రాజేష్, రమేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించబడినట్లు తెలి పారు. ఈ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు సంత వేలం పాట



**టేకులపల్లి,మార్చి 22,ప్రజాజ్యోతి:** మండల కేంద్రం లోని టేకులపల్లి, గోలియా తండా ఉమ్మడి పంచాయతీ లోని నిర్వహిస్తున్న వారపు సంత వేలం పాట మార్చి 23న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పంచాయ తీల సర్పంచులు బోడ బాలు, లకావత్ నాకా లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంత వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు ముందస్తుగా 50వేల రూపాయలను డిపా జిట్ చేయాల్సిందిగా వారు తెలిపారు. నిర్ణయిత సమయంలో 50వేల రూపా యలు డిపాజిట్ చేసి సంత వేలంపాటలో పాల్గొనాలని టేకులపల్లి,గోలియా తండ సర్పంచ్లు తెలిపారు.

## దేవస్థానం ప్రభుత్వ భూముల అక్రమాలను అరికట్టాలి



**భద్రాచలం ,మార్చి 22, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని దేవస్థానం మరియు ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ప్రజాపందా రాష్ట్ర నాయకుడు కెచ్చెల రంగా రెడ్డి డిమాండ్ చేశారు భద్రాచలం లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారుదేవస్థానం మరియు ప్రభుత్వ భూములను పలుకుబడిని ఉపయోగించి అన్యాక్రాంతం చేస్తున్న పెద్దల ఆట కట్టించాలని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు జీవ నోపాధి కోసం కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న పేదల గుడిసెలపై చర్యలు తీసుకోవద్దని సూచించారు.ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న చట్టాలు అధికారుల నిర్లక్ష్యం మరియు అవినీతి కారణంగా ఉల్లంఘించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అభివృద్ధి పనులు చేపట్టే సందర్భంలో పిసా చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు సూచించారు సహజ వన రులైన అడవులు ఇసుక నీరు గాలి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.నిబం ధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై వారు ఎంతటి పెద్దలైనా కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయన్న మునిగేలా శివ ప్రశాంత్ మడకం దేవయ్య మడివి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫోర్ వే రోడ్ పనులు

- గుత్తేదారుల నిర్లక్ష్యం
- రాత్రివేళల్లో లైటింగ్ లేక ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితి
- సరిపోని వాటరింగ్ తో దుమ్ము ధూళి సమస్య తీవ్రం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 22, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఫోర్ వే రోడ్ నిర్మాణ పనులు స్థానిక ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా భద్రతా ప్రమా ణాలు పూర్తిగా విస్మరించబడడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఎక్కడా హెచ్చరిక బోర్డులు లేకుండా, ప్రమాద సూచనలు లేకుండా పనులు కొనసాగించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.ప్ర త్యేకంగా రాత్రివేళల్లో రోడ్డుపై ఎలాంటి లైటింగ్ లేకపోవడం వాహనదారు లకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తోంది. నిర్మాణంలో ఉన్న రహదారి అయిన ప్పటికీ, “పనులు జరుగుతున్నాయి”, “జాగ్రత్తగా వెళ్లండి” వంటి సూచనలు ఎక్కడా ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.రోడ్డు పనుల కారణంగా ఎగసిపడుతున్న దుమ్ము ధూళి సమీపంలోని ఇళ్లలోకి చేరి ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. గుత్తేదారులు వాటరింగ్ చేస్తున్నప్పటికీ, అది సరిపోకపోవడంతో దుమ్ము పూర్తిగా తగ్గడం లేదు. ముఖ్యంగా ఉదయం వేళల్లో సరైన విధంగా నీరు చల్లకపోవడంతో, ఆ సమయంలో వచ్చే దుమ్ము ధూళి కారణంగా గ్రామంలోని సగం జనాభా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. పాదచారులకు నడిచేందుకు సరైన మార్గం లేకపోవడం, భారీ యంత్రాలను నిర్లక్ష్యంగా నడపడం వల్ల ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితులు నెలకొ న్నాయి.ఇప్పటికే కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ, అధికారులు లేదా గుత్తేదారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే రోడ్డు పనుల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని, హెచ్చరిక బోర్డులు మరియు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, దుమ్ము నియంత్రణ కోసం తరచుగా మరియు సమర్థవం తంగా నీరు చల్లాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గుత్తేదారుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఎప్పుడైనా పెద్ద ప్రమా దం సంభవించే అవకాశముందని వారు గట్టిగా హెచ్చరిస్తున్నారు.